teluguislam.net



# 27. రమజాన్ మాస విశిష్టత

**మిత్రులారా.!**

నేటి ఈ ఖుత్బాలో పవిత్ర రమజాన్ మాసం శుభాలు, వరాల గురించి తెలుసుకుందాం.

పవిత్ర రమజాన్ మాసానికి విశ్వాసుల్లో ఎనలేని ప్రాముఖ్యత ఉంది. ఆ మాసం సమీపిస్తే చాలు వారిలో తెలియని ఆత్రుత, అల్లాహ్ మార్గంలో అంకితమవ్వాలని, అల్లాహ్, ప్రవక్త (స) ఆజ్ఞలను శిరసావహించాలని ప్రతి ఒక్కరూ తాపత్రయ పడుతుంటారు. రమజాన్ మాసం విశ్వాసులకు దైవం ప్రసాదించిన పవిత్ర శిక్షణా శిబిరం. దీనిలో ఒక మాసం పూర్తి శిక్షణ ఇవ్వడం జరుగుతుంది. తద్వారా మిగతా మాసాల్లో అతని జీవితం దైవధ్యానంలో ప్రశాంతంగా,సజావుగా గడవాలని ఆశించడం జరుగుతుంది. పవిత్ర రమజాన్ మాసానికి సంబంధించి అనేక ఆదేశాలు, ఉల్లేఖనాలున్నాయి. వాటిలో కొన్ని మనం తెలుసుకుందాం. దైవ ప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు:

**రమజాన్ మాసం అవతరించినపుడు స్వర్గద్వారాలు తెరవబడతాయి. నరక ద్వారాలు మూసివేయబడతాయి. షైతాన్‌లు సంకెళ్ళతో బంధించ వేయబడ తారు, (సహీహ్ బుఖారీ, సహీహ్ ముస్లిం)**

మరో హదీసులో ఇలా సెలవిచ్చారు:

**రమజాన్ మాసం ప్రారంభం కాగానే ఆకాశం నుండి దైవ దూత ఇలా పిలుపు నిస్తాడు : "ఓ మంచిని కోరేవాడా! త్వరపడు. ఓ చెడుని కోరేవాడా! చెడును త్యజించు". ఆ తరువాత అల్లాహ్ కొందరిని నరకం నుండి విముక్తి కల్పిస్తాడు, ఇలా ప్రతి రాత్రి జరుగుతుంది. (సునన్ తిర్మిజీ)**

రమజాన్ శుభాలను, కారుణ్యాలను, సమృద్ధులను తెలుపుతూ దైవప్రవక్త(స) ఇలా తెలిపారు. "రమజాన్ మాసం మీ కోసం శుభాలను తీసుకొచ్చింది. అల్లాహ్ మిమ్మల్ని ఆ శుభాలలో ముంచెత్తుతాడు. తన కారుణ్యాన్ని కురిపిస్తాడు. పాపాలను

మన్నిస్తాడు, మీ దుఆలను అంగీకరిస్తాడు. ఈ రమజాన్ మాసంలో అల్లాహ్ మీ మధ్య పోటీ తత్వాన్ని చూస్తాడు. దైవదూతల ముందు మీ పై గర్వపడతాడు. అల్లాహ్ ప్రసన్నత కోసం సత్కార్యాలు చేయండి. ఈ పవిత్ర మాసం కారుణ్యాలను కోల్పోయినవాడే అసలైన దౌర్భాగ్యుడు" (హాకిం).

పవిత్ర రమజాన్ మాసం వస్తూ వస్తూ తనతో శుభాల సరోవరాన్ని తీసుకు వస్తుంది. ఈ మాసం రాగానే ప్రతి విశ్వాసి మేను పులకిస్తుంది. ఆనందాల్లో విహరిస్తాడు. ప్రతి ఒక్కరికి శుభాకాంక్షలు తెలుపుతాడు. ఇది విశ్వప్రభువు అల్లాహ్ తరుపు నుండి ముస్లింలకు ప్రసాదించబడిన ఓ అపురూప కానుక, ఓ ప్రత్యేక అనుగ్రహం. ఇలాంటి పవిత్ర మాసంలో ప్రతి ఒక్కరూ సత్కార్యాల్లో పోటీపడాలి, సదాచరణ పెంపొందించు కోవటానికి ముందుకు రావాలి. సమాధుల్లో (బర్జఖ్ వ్యవస్థలో) ఉన్న మృతులు కూడా సత్కార్యాలు, దానధర్మాలు, ఖుర్ఆన్ పారాయణం చేసే భాగ్యం తమకు లభిస్తే ఎంత బాగుంటుందని తపిస్తూ ఉంటారు.

حَتَّىٰٓ إِذَا جَآءَ أَحَدَهُمُ ٱلْمَوْتُ قَالَ رَبِّ ٱرْجِعُونِ ﴿٩٩﴾

**తమ నిత్య జీవితంలో సత్కార్యాలు చేయని వారి ఆత్మలు ఇలా అంటూ దుఃఖిస్తాయి. "ఓ మా ప్రభూ! మేము చేయకుండా వచ్చిన సత్కార్యాలు చేయ టానికి" మమ్మల్ని తిరిగి (భూ లోకానికి) పంపు.**

***(అల్ మూమినూన్ 23 : 99)***

కాని వారికి ఎలాంటి జవాబు లభించదు. వారికీ, వారి సత్కార్యాలకి మధ్య వారధి ఏర్పడుతుంది. వారు ఆశించిన వాటిని చేయలేకపోతారు. సత్కార్యాలు చేయని వారికి స్వర్గ ప్రవేశం లభించదు.

ఈ పవిత్ర మాసం కారుణ్యాల మహా సాగరం. ఈ శుభాల మాసంలో సత్కార్యాల్లో, దైవ ధ్యాస్యంలో, ఖుర్ఆన్ పారాయణంలో లీనమై ఉండాలి. అనాథులు, అభాగ్యులు నిరుపేదలను నిండు మనసుతో ఆదరిస్తూ, వారి అవసరాలను తీర్చాలి. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలి.

దైవప్రవక్త (స) ప్రతి రమజాన్ మాసంలో దైవదూతల నాయకులు జిబ్రయీల్ (అలై) కు పూర్తి ఖుర్ఆన్ వినిపించేవారు. రమజానేతర మాసాల్లో కంటే ఎక్కువగా ఈ మాసంలో అత్యధికంగా ధానధర్మాలు చేసేవారు. ఈ మాసం విశ్వాసుల పాలిట

teluguislam.net



వరం. అమూల్యమైనది. రమజాన్ మాసంకంటే శ్రేష్ఠమైన, ఘనమైన, శుభదాయకమైన మాసం మరొకటి లేదని దైవప్రవక్త (స) తెలిపారు.

**సహ్రీ అవశ్యకత-ఘనత**

సహ్రీ అవశ్యకతను, ఘనతను తెలుపుతూ దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు:

**"సహ్రీని భుజించండి, అందులో ఎంతో శుభం ఉంది".**

**(సహీహ్ బుఖారీ, సహీహ్ ముస్లిం)**

మరో హదీసులో ఇలా ప్రస్తావించారు:

**"మన (ముస్లిం) ఉపవాసాలకు, వారి (యూదులు, క్రైస్తవులు) ఉపవాసాలకు మధ్యగల వ్యత్యాసమే సహ్రీ భుజించటం"**

**(సహీహ్ బుఖారీ, సహీహ్ ముస్లిం)**

మరో హదీసులో ఇలా ప్రబోధించారు: ఇర్బాజ్ బిన్ సారియా (రజి) ఇలా తెలిపారు: ఒక సారి దైవప్రవక్త (స) సహ్రీ కోసం ఆహ్వానించారు. అపుడు ఆయన ఇలా అన్నారు: "విచ్చేయండి, ఉదయపు శుభప్రద భోజనం కోసం".

(సునన్ అబూదావుద్, సునన్ నసాయి).

హజ్రత్ అనస్ రజియల్లాహు అన్హు కథనం: దైవ ప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు:

**"అల్లాహ్, ఆయన దూతలు సహ్రీ భుజించేవారిపై శాంతి శుభాలను (సలాత్) కురిపిస్తారు". (సహీహ్ బుఖారీ, సహీహ్ ముస్లిం)**

రమజాన్ మాసంలో ఖియామ్ విశిష్ఠతను తెలుపుతూ దైవప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు:

**"ఎవరైతే విశ్వాసంతో, పుణ్యఫలాపేక్షతో రమజాన్ మాసంలో 'ఖియామ్' చేస్తారో (రాత్రుళ్ళు దైవారాధనలో గడుపుతారో) అతని పూర్వ పాపాలు మన్నించబడతాయి". (సహీహ్ బుఖారీ, సహీహ్ ముస్లిం)**

**ప్రళయదినాన అల్లాహ్ సమక్షంలో అది (ఉపవాసం) ఉపవాసి మన్నింపు కోసం సిఫారసు చేస్తుంది. ఈ పవిత్ర మాసంలో ఉమ్రా చేయటం హజ్ చేయటంతో సమానం. (సహీహ్ బుఖారీ, సహీహ్ ముస్లిం)**

ఈ పవిత్ర మాసంలో ఒక ఘనమైన రాత్రి ఉంది. దాన్ని ఎవరైనా పొందితే వెయ్యి మాసాల ఆరాధనకు లభించే పుణ్యం ఆ ఒక్కరాత్రిలో చేసే ప్రార్థనకు లభిస్తుంది. ఆ రాత్రి దైవదూతలు ఆకాశం నుండి భూమిపై సమూహంగా వస్తారు. దైవారాధన, అల్లాహ్ స్మరణ జరుగుతున్న ప్రదేశాల్లో వాలిపోతారు. వారి కొరకు అల్లాహ్‌తో దూతలు దుఆ చేస్తారు.

ఇలాంటి సందర్భాన్ని కోల్పోయేవాడు పరమ దౌర్భాగ్యుడు. అతడు అన్ని శుభాలు కోల్పోయినవాడే.

విశ్వాసి తన అన్ని కార్యాల్లో ఏకాగ్రత కలిగివుండాలి. చేసే ప్రతి ఒక్క మంచి కార్యాన్ని అల్లాహ్ కొరకే చేయాలి. అల్లాహ్ కొరకు చేసే ప్రతి సత్కార్యంలో కించిత్ కూడా స్వార్థం, ప్రదర్శనాబుద్ధి వుండరాదు. దానివల్ల పుణ్యాలు పూర్తిగా వృధా అయిపోతాయి. ఎందుకంటే రమజాన్ మాసం పూర్తయ్యాక దాసుడు అల్లాహ్ సమక్షంలో తన పాపాల మన్నింపుకై, నరకం నుండి విముక్తికై, చేసిన సదాచారాల ప్రతిఫలాన్ని ఆశిస్తూ తన చేతులను దుఆలకై చాపుతాడు. అతనిలో ఏకాగ్రత ఉంటే, కేవలం అల్లాహ్ కోసమే పుణ్యాకార్యాలు చేసివుంటే అల్లాహ్ ఆ దాసుడిని మెచ్చుకొని అతని పాపాలను మన్నిస్తాడు. అతనికి స్వర్గాన్ని ప్రసాదిస్తాడు. దానిపై దూతలను సాక్ష్యంగా నిలుపుతాడు. అదే ఒక విశ్వాసికి అసలు సిసలైన ఆనందం. అదే అన్నింటికంటే విలువైన ధనం.

అందుకే అలాంటి సందర్భాలను చేజారకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తపడుతూ ఉండాలి. విలువైన పవిత్ర రమజాన్ మాసాన్ని గ్రహించి దానిలో తన పాపాల మన్నింపుకై అల్లాహ్‌తో వేడుకుంటూ ఉండాలి. ఎల్లప్పుడు దుఆల్లో పవిత్ర ఖుర్ఆన్ పారాయణంలో, సదాచారాల్లో నిమగ్నమైవుండాలి.

అల్లాహ్ విశ్వాసులందరికి పవిత్ర మాసాన్ని గుర్తించి, పుణ్యాలు చేసుకుని, పాపాల మన్నింపుకై వేడుకునే అనుగ్రహాన్ని ప్రసాదించుగాక.... ఆమీన్.!